# హంసలను వేటాడొద్దు [15]

మూలం: బోరిస్ వాసిల్యేవ్

అనువాదం: కె. సురేష్



**అనువాదం:** హంసలను వేటాడొద్దు [15]

**మూలం:** డోంట్ షూట్ ద వైట్ స్వాన్స్

**మూల రచయిత:** బోరిస్ వాసిల్యెవ్

**అనువాదకుడు:** కె. సురేష్

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: జులై 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=3115

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**

Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# హంసలను వేటాడొద్దు [15]

దీని ముందు భాగం

**జరిగిన కథ:** ఓవా చంపేయబోతే తన దిక్సూచి లంచంగా ఇచ్చి కోల్కా కాపాడుకున్న కుక్కపిల్ల సుస్తిక్ ఇప్పుడు ఓవా ఇంటి దగ్గర అలాగే నిర్లక్ష్యం కాబడుతుంది. ఓవా దాన్ని చంపేయకుండా ఉండాలంటే ఈసారి డబ్బులు లంచంగా కావాలంటాడు. నోనా యురీవ్నా ఇంటిని బాగు చేస్తున్న యెగార్ ప్రకృతి పట్ల, పర్యావరణం పట్ల తన భావాల్ని కొత్త అటవీఅధికారి యూరీ పెట్రోవిచ్‌తో పంచుకుంటాడు. అతనికి తన మాటలు శ్రద్ధగా వినేవారుండటం అతనికి నచ్చుతుంది. యూరీ పెట్రోవిచ్ యెగార్‌ను ఓవారం రోజుల పాటు తన సహాయకునిగా నియమించుకోవాలనుకుంటాడు. యూరీ పెట్రోవిచ్, నోనా యురీవ్నాల మధ్య సాన్నిహిత్యం పెరుగుతుంది. వారిద్దరూ యెగార్, కోల్కాలతో కలిసి నల్లచెరువు దగ్గరకు విహారానికి వెళ్లాలనుకుంటారు. **ఇక చదవండి:—**

## 15

యూరి పెట్రోవిచ్ ఒక్కడే అడవికి వెళ్లి ఉంటే ఏమి చేసి ఉండేవాడో యెగార్‌కి గానీ, కోల్కాకి గానీ అర్థం కాలేదు. ఒక్కసారి దట్టమైన అడవిలోకి ప్రవేశించిన తరువాత వాళ్లిద్దరూ పనిలో తలమునకలౌతున్నారు.

ఉదాహరణకు కోల్కాకి వన్యప్రాణులన్నింటినీ “పక్షులు, జంతువుల పరిశీలన పుస్తకం”లో నమోదు చేసే పని అప్పగించారు. అతడు తోక ఊపే పిట్టని చూస్తే దానిని ఎక్కడ చూశాడు, అప్పటి సమయం, అది ఎవరితో ఉంది, ఏం చేస్తోంది వంటివన్నీ రాయాలి. మొదట్లో కోల్కా ఉత్సాహం కొద్దీ, “యూరి పెట్రోవిచ్, అక్కడ కొమ్మ మీద బూడిద రంగుదేదో ఉంది!” అంటూ అడవంతా దద్దరిల్లిపోయేలా అరిచేవాడు.

పుస్తకంలో రాయటానికి అవకాశం ఇవ్వకుండా ఆ బూడిద రంగుదేదో ఎగిరిపోయేదని ప్రత్యేకంగా చెప్పాలా. కోల్కా అత్యుత్సాహం చూసి అటవీ వార్డెను అతడిని వెనక్కి పంపించేస్తాడేమోనని యెగార్ భయపడ్డాడు. కానీ యూరి పెట్రోవిచ్ ప్రతిసారీ ఓపిగ్గా ఆ బూడిద రంగు పిట్ట శాస్త్రీయ నామం చెప్పి దాని గురించి ఏమి రాయాలో చెప్పేవాడు. ఆ సాయంత్రానికి

కోల్కా చాలానే నేర్చేసుకున్నాడు. ఏదైనా కనిపడితే అతడు అరవకుండా ఊపిరిబిగబెట్టి, నాలుక బయటపెట్టి, తన పుస్తకంలో రాసేవాడు:

“1700 గంటలు, 37 నిమిషాలు. చిన్నపిట్ట, నల్లంచిగాడు. భుజపత్ర చెట్టులో కూర్చుని ఉంది.”

కొత్తది రాసిన ప్రతిసారీ కోల్కా తప్పులుంటే సరిచేస్తాడేమోనని పుస్తకాన్ని తండ్రికి చూపించేవాడు. అయితే పదాలు రాయటంలో యెగార్‌కి అంత నైపుణ్యమేమీ లేదు. కానీ కోల్కాతో ప్రతిసారీ, “గడియారం పోగొట్టకు, కొడుకా,” అనేవాడు.

కోల్కాకి తన పరిశీలనల సమయం కచ్చితంగా తెలియటానికని ఒక గడియారాన్ని యూరి పెట్రోవిచ్ ఇచ్చాడు.

“1700 గంటలు, 58 నిమిషాలు. ఎలుక. ఎటో పరిగెత్తింది, ఎక్కడనుంచి వచ్చిందో గమనించలేదు.”

“పరిశోధకులు కచ్చితంగా ఉండటం చాలా అవసరం,” చెప్పాడు యూరి పెట్రోవిచ్. “రచయిత కాల్పనికతకు పాల్పడవచ్చు, కానీ మనం కాదు. నువ్వు, నేను కోల్కా, విజ్ఞాన శాస్త్రానికి అమర వీరులం.”

“అమర వీరులం ఎందుకని?”

“విజ్ఞాన శాస్త్రంలో త్యాగాలు చెయ్యకపోతే కొత్త ఆవిష్కరణలు ఏమీ చెయ్యలేం. తేలికగా కనుక్కోగలిగినవన్నిటినీ ఎంతో కాలం క్రితమే కనుక్కున్నారు. ఇంకా కనుక్కోవలసినవాటికి స్వార్థరహిత శ్రమ కావాలి. అదీ విషయం, పొలుష్కిన్.”

యూరి పెట్రోవిచ్ సంతోషంగానే కాక ప్రతిసారీ అవసరమైనదానికంటే పెద్దగా కూడా మాట్లాడుతున్నాడు. అతడు అంతలా ఎందుకు ప్రయాస పడుతున్నాడో మొదట కోల్కాకి అర్థం కాలేదు. కానీ ఆ తరువాత అతడికి వెలిగింది: అదంతా నోనా యురీవ్నా వినటానికి. ఓల్యా కుజినా కోసం తాను చేసినట్టు నోనా కోసం యూరి పెట్రోవిచ్ పెద్ద, పెద్దగా మాట్లాడుతున్నాడు.

అందుకు విరుద్ధంగా నోనా యురీవ్నా ఆ రోజంతా సగం నిద్రలో ఉన్నట్టు గడిపింది. అంతా కొత్తగా, వాస్తవం కాదేమో అన్నట్టు ఉంది: యూరి పెట్రోవిచ్ నవ్వులు; యెగార్ హృదయపూర్వక స్పందనలు; పనిలో నిమగ్నమై తెరుచుకున్న కోల్కా నోరు; బరువుగా ఉన్న కొత్త భుజంసంచి;

కవుకు ఆకుల వాసన; ఆకుల గలగల; కాళ్లకింద ఫటఫటమనే పుల్లలు. మునుపటి కంటే తీవ్రంగా ఆమె అంతా చూస్తోంది, అంతా వింటోంది, అంతటినీ అనుభూతి చెందుతోంది, కానీ దానినంతటినీ దూరం నుంచీ, ఆ నడుస్తున్న అమ్మాయి తాను కాకుండా ఎవరో తెలియని వ్యక్తి అయినట్టు నోనా ఆశ్చర్యంతో చూస్తూ ఉంది. ఎవరో తెలియని వ్యక్తితో, యెగార్ పొలుష్కిన్‌తో నల్ల చెరువుకి తాను వెళుతుందని నిన్న ఎవరైనా అని ఉంటే ఆమె పెద్దపెట్టున నవ్వేసి ఉండేది. కానీ, ఈ రోజు తాను అదే పని చేస్తోంది. ఎటువంటి ప్రతిఘటన లేకుండా ఆమె ప్రయాణమయ్యింది. పొలుష్కిన్ ఇంటి నుంచి పరిగెత్తుకుంటూ వచ్చిన అటవీ వార్డెను భృకుటి ముడివేసి అడిగాడు, "ఇంకా తయారు కాలేదేమిటి? ఆ సూట్‌కేసు ఎందుకు? భుజంసంచి బాగుండేది కదా? అది లేదా? దుకాణం ఎక్కడ? మలుపు దగ్గరా? సరే, నువ్వు నాస్తా సిద్ధం చెయ్యి. నేను వెంటనే వచ్చేస్తాను."

నోనా కళ్లు మూసి తెరిసే లోపల యూరి పెట్రోవిచ్ భుజంసంచి కొనుక్కుని వచ్చేసాడు. ఆ తరువాత అతడు నాస్తా చేస్తూ ఆమెను కూడా పొట్టనిండా తినమని ఒత్తిడి చేసాడు. కాసేపటికి పొలుష్కిన్‌లు వచ్చారు: యెగార్, కోల్కా. ఆ తరువాత యూరి పెట్రోవిచ్ తన పెద్ద భుజంసంచిని వీపుమీదకి ఎత్తుకుంటూ, "ఈ దళానికి నేను నాయకుడిని," నవ్వుతూ చెప్పాడు.

ఏం జరుగుతోందో అర్థమయ్యేలోపు నోనా అడవిలో ఉంది. సంవత్సరం క్రితం మరిచిపోలేని మహిళా దినోత్సవం తరువాత పెట్టె అడుగుకి చేరిన ప్యాంటుని ఆ రోజు వేసుకుంది. ఈ సంవత్సర కాలంలో ఆ ప్యాంటు కొంచెం బిగుతవ్వటంతో ఆమెకి తెగ ఇబ్బందిగా అనిపించసాగింది. ఆమె సిగ్గు ఇంకా తొలగక ఒంటరిగా ఉండటానికి ప్రయత్నిస్తోంది, లేదంటే కొంచెం కోల్కా పక్కగా నడుస్తోంది. ఆమె ఇంకా మౌనంగానే ఉంది కానీ వాళ్ల సంభాషణ వింటోంది.

పురుషులు సందర్శించని ఇంట్లో నోనా పెరిగింది. మగవాళ్లకు స్వాభావికమైన తీవ్ర మార్పులు, సంచలనాలు లేకుండా ఆమె జీవితం మంద్ర ప్రవాహం మాదిరి సాగిపోయింది. మానవ సంబంధాల స్థానాన్ని కవిత్వం తీసుకుంది. మానవ ఉద్వేగాల పట్ల నోనాకి ఉన్న అస్పష్ట భావనల స్థానాన్ని సంగీత కచేరీలు తీసుకున్నాయి. గోలగలగా ఉండే ఆమె స్నేహితురాళ్ల సాంగత్యం ఆమెకు ఇబ్బందికరంగా అనిపించటంతో సాయంత్రం తరగతులు అయిపోగానే హడావిడిగా ఇంటికి వెళ్లిపోయేది. తన ఉద్వేగపు కోరికలన్నింటినీ మానవతావాదులైన మహనీయుల సూక్తుల మాటున మరుగుపరుచుకుంది.

ఆ విధంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా రోజులు గడిచిపోయినప్పటికీ, ఆ రోజుకీ మర్నాటికీ తేడాలేకుండా సాదాగా ఉండేవి. అంతా అర్థవంతంగా, సరిగా ఉన్నట్టనిపించినా ఎందుకనో సాయంత్రాలు సుదీర్ఘంగా అనిపించసాగాయి. అంతేకాకుండా ఒక ఆందోళన – ఏ ఆధారమూ, ఏ లక్ష్యమూ లేని ఆందోళన పెరుగుతుండేది. నోనా పుస్తకం చదువుతూ, చదువుతూ ఆ అకారమైన భయపెట్టని ఆందోళనను ఆలకించేది. అప్పుడు పుస్తకం పేజీలు తిరిగేవి కావు, చూపులు శూన్యంలోకి ప్రసరించేవి. పురాతన రష్యా సాహిత్యంపై మరో నివేదికలోని ఖాళీ పేజీలపై ఆమె చెయ్యి అసంకల్పితంగా పిచ్చి గీతలు గిలికేది.

వాళ్ల సహోధ్యాయుల్లో చాలా తక్కువమంది మగవాళ్లు ఉండేవాళ్లు, ఉన్న కొద్దిమందిని దూరదృష్టిగల నోనా స్నేహితురాళ్లు ఎప్పుడో ఎగరేసుకుపోయారు. నోనా విందులకు వెళ్లేది కాదు, అనుకోకుండా పరిచయమైనవాళ్లంటే భయముండేది. దాంతో ఆమె మిత్ర బృందం పెద్దదయ్యే అవకాశమే లేదు. అందువల్ల లెనిన్‌గ్రాడ్‌లోని అంతులేని సాయంత్రాలు అమ్మతోటి గడిచేవి.

“జాగ్రత్త, అమ్మాయీ.”

“జాగ్రత్త, అమ్మా.”

రైలు కదలబోతున్న చివరి క్షణాల్లో పలికిన ఆ పదాల్లో ఎంత ఆశ, ఎంత భయం మిళితమై ఉన్నాయో ఎవరికి తెలుసు? రైలు కదలటంతో అమ్మ కూడా దానితోపాటే వేగంగా అడుగులు వెయ్యసాగింది. నోనా నవ్వింది, ఆ నవ్వుకి ఆమె తన శక్తినంతటినీ కూడదీసుకోవలసి వచ్చింది. అమ్మ కూడా నవ్వింది. రెండు కన్నీటిబొట్ల మాదిరి వాళ్లిద్దరి నవ్వు ఒకే మాదిరిగా ఉంది.

“జాగ్రత్త, అమ్మాయీ.”

“జాగ్రత్త, అమ్మా.”

రెండు బదిలీలు, మూడు వందల కిలోమీటర్ల తరువాత చివరికి నోనాకి ఈ ఊళ్లో ఉద్యోగమయ్యింది. ఇక్కడ ఆమెకు ఒక తరగతి, కొంతమంది పిల్లలని అప్పగించారు, విద్యాశాఖ ఖర్చుతో ఆమెకు ఒక గది ఇచ్చారు. ఇక్కడకు వచ్చిన తరువాత సాధ్యమైనంతగా ఉత్సాహాన్ని కనబరుస్తూ అమ్మకు ఒక సుదీర్ఘ ఉత్తరం రాసింది, ఇంటి యజమానురాలు అడిగిన వందల ప్రశ్నలకు సమాధానం ఇచ్చేది, రాత్రిలో సగం సేపు దిండు అడ్డం పెట్టుకుని నిశ్శబ్దంగా ఏడ్చేది, ఉదయం నోనా యురీవ్నాగా మారిపోయి తరగతి గదిలో హాజరయ్యేది. ఉపన్యాసాలు, అమ్మ చేసి

పెట్టిన మిఠాయిలు, సంగీత కచేరీలు, లెనిన్‌గ్రాడ్ వంతెనలు, నాటకశాల, దూరపు బంధువుల ఇళ్లల్లో తేనీటి విందుల్లాంటివన్నీ అవాస్తవమనిపించేంతగా మసకబారిపోసాగాయి. ప్రస్తుతమే వాస్తవం: గోలగోలగా ఉండే పాస్‌బెల్లు, పిల్లల కళ్లు, ఊరి దుమ్ము, కిర్రుమనే దారులు, తన ఇల్లు, తన జీవికకు సంబంధించి చింతలు. మరి భవిష్యత్తు? భవిష్యత్తనేది లేదు, ఎందుకంటే నోనా యురీవ్నా కలగంటున్నది గతమూ, ప్రస్తుతం కంటే భిన్నమైనది కాదు: లెనిన్‌గ్రాడ్ వెళ్లి అమ్మను చూడలనుకోవటం, వచ్చే సంవత్సరం తగినన్ని పాఠ్యపుస్తకాలు ఉంటాయని ఆశించటం.

అంతే కాకుండా మిగతా ఆడపిల్లలు కనే కలలే ఆమె కూడా కనేది. అయితే ఈ కలలు ఎంత రహస్యంగా ఉండేవంటే వాటిని స్పష్టంగా వివరించటం అసాధ్యం.

ఇప్పుడు ఆమె దట్టమైన అడవిలో అలవాటులేని భుజసంచితో, పట్నవాసపు చిన్నమడాల చెప్పులతో – వాటిని చూసి యూరి పెట్రోవిచ్ కిసుక్కున నవ్వాడు – నేలలోకి దిగబడుతూ, లేదా కాలినుంచి చెప్పులు జారిపోతూ నడుస్తోంది. ఆమె అందమైన ప్యాంటు (ఎబ్బెట్టు అనిపించేలా అది బిగుతైపోయింది) మంచుకి తడిసిపోయింది. ఆమె పాఠశాలకి వేసుకెళ్లే నైలాను కోటు కొమ్మలకు, ముళ్ల మొక్కలకు చిక్కుకోసాగింది. ఇటువంటి ప్రయాణానికి నోనా ఎంతమాత్రం తగదనిపించేలా ఉన్నట్టుండి ఆమె వళ్లంతా ఆవిర్లు కమ్ముతుంది, లేదా బాగా చల్లబడిపోతుంది. ఈ ప్రయాణంలో తన అవసరం లేదనిపించి న్యూనతకి లోనైనప్పటికీ పంటి బిగువున పడిపోయిన చెట్లు, పొదలగుండా నడుస్తూనే ఉంది.

మధ్యాహ్నానికి ఆమె శక్తి పూర్తిగా ఉడిగిపోయింది. అయితే ఆమె అదృష్టం బాగుండి యూరి పెట్రోవిచ్ విరామం ప్రకటించాడు. భుజసంచి కిందపడేసి, ఊపిరిపీల్చుకున్న నోనా ఈ ప్రయాణంలో తన ఉపయోగం కూడా ఎంతో కొంత ఉందనిపించుకోటానికి వెంటనే వంట పనిలోకి దిగింది. ఆరుబయట వండటం గురించి నోనాకి అంతగా తెలియదన్నది నిజమే. అయితే ఆ పనిని ఎంతో ఉత్సహంతో చేపట్టింది. అర్ధగంటలో గోధుమ అన్నం ఇంకా ఉడకలేదు కానీ పొంగుబట్టింది. నోనా గుసగుసగా ఏదో అంటూ అది పొంగకుండా పాత్రలోపలే ఉంచటానికి ఎంతో ప్రయత్నంచింది కానీ అది మొండిగా పొంగుతూ మంటలోపడసాగింది.

“ఒక సైన్యానికి సరిపడా తిండి ఉంది,” నవ్వుతూ అన్నాడు యూరి పెట్రోవిచ్. “నువ్వు మంచి ఆకలి మీద ఉన్నట్టున్నావు నోనా యురీవ్నా!”

"మనమంతా కలిపి లాగిద్దాం," అన్నాడు యెగార్.

చివరికి అడుగంతా గీకి, గిన్నెలు నాకి పొట్టలు బరువెక్కేలా తిన్నారు. గిన్నెలు కడగటానికి నోనా వాగు దగ్గరకు వెళ్లింది. ఆమెకు సహాయం చెయ్యటానికి కోల్కాని పంపించాడు యెగార్. ఆరిపోతున్న మంట దగ్గర ఇద్దరు మగవాళ్లు కూర్చుని ఉన్నారు.

"మీకు కుటుంబముందా, లేక ఇంకా ఒంటరి వారేనా?" యెగార్ మర్యాదగా అడిగాడు.

యూరి పెట్రోవిచ్ అతడివంక వింతగా చూసాడు, అంతకంటే వింతగా బదులేమీ ఇవ్వకుండా మౌనంగా ఉండిపోయాడు. అతడి ఇబ్బందిని గ్రహించిన యెగార్ నాలిక కరుచుకున్నాడు.

"వ్యక్తిగత విషయాల్లోకి వెళ్లినందుకు మన్నించాలి. మీరు వయస్సులో ఉన్నారు, మంచి హోదాలో ఉన్నారు, అహ్, అందుకని... మీకు తెలుసుగా."

"యెగార్ సవెలిచ్, కూటుంబ మనిషినో, బ్రహ్మచారినో నాకే సరిగ్గా తెలియదు."

"అదెలాగ?"

"ఎలాగేముంది, అదంతే."

యూరి పెట్రోవిచ్ మౌనం దాల్చాడు. అతడు సిగరెట్లు బయటకు తీసి ఒకటి యెగార్‌కి ఇచ్చాడు. మండుతున్న బొగ్గుతో వాటిని వెలిగించుకున్నారు. ఆ ప్రశ్న అడిగినందుకు యెగార్ లోపల్లోపల తననితాను వందసార్లు తిట్టుకుని వేరే సంభాషణ మొదలుపెట్టటానికి ప్రయత్నించాడు, పలుమార్లు నవ్వాడు కూడా. అయినా యూరి పెట్రోవిచ్ ఆలోచనామగ్నుడై అన్యమనస్కంగా సమాధానాలు ఇచ్చాడు.

నోనా కూడా తన ఆలోచనల్లో మగ్నమై వాగు దగ్గర గిన్నెలు కడుగుతోంది. ఆమె పక్కనున్న కోల్కా ఎడతెరిపి లేకుండా ఏదో మాట్లాడుతూనే ఉన్నాడు. జంతువులు, పక్షులు గురించి అతడు మాట్లాడుతున్నంతసేపు నోనా వాటిని చెవినపెట్టలేదు. కానీ కోల్కా ముళ్లపంది గురించి మాట్లాడుతూ హఠాత్తుగా ఆపేశాడు. అతడు ఒక క్షణంపాటు ఆలోచించి, నిట్టూర్చి కోపంగా అడిగాడు, "అయితే నువ్వు యూరి పెట్రోవిచ్‌తో వెళ్లిపోతావన్నమాట. అంతే కదూ?"

"ఎక్కడికి వెళ్లటం?" నోనా లోపల ఏదో బద్దలైనట్టుంది, కాళ్లను ఒక చల్లటి తరంగం తాకింది. "ఎందుకు వెళ్లటం కోల్కా?"

“ఎందుకేముంది, పెళ్లిచేసుకుని పట్టణం వెళ్లిపోతావు,” కోల్కా కోపంగానే వివరించాడు. “అందరూ అంతే చేస్తారు.”

“పెళ్లిచేసుకునా? పెళ్లిచేసుకునా?” నోనా సాధ్యమైనంత పెద్దగా నవ్వుతూ, కోల్కా పైకి నీళ్లు చల్లుతూ, వాగులోకి ఒక గరిట జారవిడిచేసింది. “విన్నావా, యూరి పెట్రోవిచ్? ఇది విన్నావా?”

అందరూ వినాలని ఆమె కావాలనే పెద్దగా అరుస్తోంది.

అందరూ, అంటే యెగార్, అటవీ వార్డెను అది విన్నారు. ఏ కారణంవల్లనో వాళ్లు నోనా ఆనందంలో పాలుపంచుకోకుండా మౌనంగా ఉండిపోయారు. నోనా కృత్రిమంగా తెచ్చిపెట్టుకున్న నవ్వు ఉన్నట్టుండి ఆగిపోయి, సిగ్గుపడి, నీటిలో గరిటకోసం వెదకసాగింది.

“బదులివ్వవేమిటి?” కోల్కా ఆమెను వదిలిపెట్టలేదు. “నీకు సమాధానం ఇవ్వటం ఇష్టం లేదంటే నిజంగానే మమ్మల్ని వదిలి వెళతావన్నమాట.”

“అది చాలా హాస్యాస్పదంగా ఉంది, కోల్కా. ఆ విషయం మళ్లీ ప్రస్తావించకు.”

అందరూ అదే చేస్తూంటే ఆ విషయం అతడెందుకు అడగకూడదు? అతడి పాత టీచరు కూడా అలాగే పెళ్లి చేసుకుని వెళ్లిపోయింది.

కోల్కా నిట్టూర్చాడు. అపనమ్మకంతో కూడిన ఆ నిట్టూర్పుని గమనించిన నోనా ఉన్నట్టుండి కళ్లనీళ్లతో పెద్దగా అరవసాగింది. “నేనస్సలు పెళ్లి చేసుకోను! ఎన్నటికీ, వినపడిందా?”

ఆమె చాలా పెద్దగా అరవటంతో కోల్కా ఆమెను నమ్మాడు. అనుమానం లేదు, ఆమె నిజంగానే పెళ్లి చేసుకోదు.

*(తరువాయి భాగం వచ్చే వారం)*

For Latest Telugu Books - Visit now:
Kinige
.com